క్లుప్తంగా

కానిస్టేబుళ్లుగా ఎంపికైన యువతకు ఎస్పీ అభినందన


ఎస్పీ అఖిల్ మహాజన్‌తో ఎంపికైన యువత

వేములవాడరూరల్: వేములవాడ మండలంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన యువతీ, యువకులను ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం అభినందించారు. 21 మంది యువకులు వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రాజశేఖర్, డీఎస్పీ నాగేంద్రచారి ద్వారా శిక్షణ పొందారు. ఆయన వద్ద శిక్షణ పొందిన యువకులు 21 మంది పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో విజయం సాధించడంతో యువకులను, కానిస్టేబుల్ రాజశేఖర్‌ను, డీఎస్పీ నాగేంద్రచారిలను ఎస్పీ అభినందించి శాలువాతో సత్కరించారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ


గ్రామస్తులకు క్రీడాకిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన క్రీడాకారులకు వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రెండుమిద్దెల జయ, సర్పంచ్ తిరుపతి, దొంతుల అంజనీకుమార్, ఉప్పుల చంద్రయ్య, పిట్టల వెంకటేశ్, సోమినేని బాలు, జనార్దన్, రాములు, దేవరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

వేములవాడ: మున్సిపల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇవ్వాల్సిన 6 నెలల ఏరియల్స్ త్వరగా చెల్లించాలని పేర్కొంటూ మున్సిపల్ గేటు ముందు సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగులు శనివారం ధర్నా చేసి మున్సిపల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఉపాధ్యాయుల వంటావార్పు


వంటచేస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట: మండలంలోని పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తుండడంతో ఉపాధ్యాయులు వంటావార్పు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ఉపాధ్యాయులే వంట చేసి వడ్డిస్తున్నారు.

నచ్చిన వృత్తిలో రాణిస్తూ..

- మెకానిక్‌గా స్థిరపడుతున్న యువత
- తాను ఉపాధి పొందుతూ
- ఎంతోమందికి ఉపాధి కల్పిస్తూ

సిరిసిల్లఅర్బన్: కష్టపడే తత్వం, ఆత్మ విశ్వాసం ఉంటే ఏ రంగంలోనైనా ఉన్నతంగా స్థిరపడొచ్చు అని నిరూపిస్తున్నారు.. నేటి యువత. ఎన్నో కారణాలవల్ల చదువుకోలేని పరిస్థితుల్లో మెకానిక్ షెడ్డులో చేరి, రిపేర్ నేర్చుకొని సొంతగా తమ కాళ్లమీద తాము నిలబడుతున్నారు. కష్టతరంగా భావించే పనుల్లో మెకానిక్ పని ఒకటి. వాహనాలను మరమ్మతు చేయడం అంటే చిన్న పని కాదు. వాహనాల విడి భాగాలను తీసి, రిపేర్ చేసి, తిరిగి బిగించడం కష్టంతో కూడుకున్న పని. అలాంటి మెకానిక్ రంగాన్ని ఎంచుకొని ఎంతోమంది యువకులు జీవనోపాధి పొందుతున్నారు. జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పట్టణం దాదాపు 400 మందికి పైగా బైక్, కారు మెకానిక్ వృత్తిలో రాణిస్తూ, ఇతరులకు ఉపాధిని కల్పిస్తున్నారు.

రిపేర్ వారికి ఉపాధి

గడిచిన పదేళ్లలో వాహనాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ వస్తోంది. ఇంటికో వాహనం తప్పనిసరిగా మారింది. వాహనాల సంఖ్యకు అనుగుణంగా మెకానిక్ సెంటర్లు కూడా వెలిశాయి. ఒకప్పుడు మెకానిక్ దుకాణాలు పదుల సంఖ్యలో ఉండేవి. కానీ ప్రస్తుతం వందల సంఖ్యలో బైక్, కారు రిపేరింగ్ సెంటర్లు వెలిశాయి. దీనిపై ఆధారపడి వందల మంది జీవనోపాధి పొందుతున్నారు. ఒకప్పుడు హెల్పర్‌గా పనిచేసిన వారే ఇప్పుడు సొంతగా మెకానిక్ షెడ్డు నెలకొల్పి, మరికొంతమందికి ఉపాధిని కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



కారు మరమ్మతు చేస్తున్న శరత్

మరో ఇద్దరికి ఉపాధి..

వరంగల్ పట్టణానికి చెందిన చెరుకు శరత్‌కుమార్ సిరిసిల్లలో 8 ఏళ్లుగా కారు మెకానిక్ వృత్తిలో స్థిరపడ్డాడు. పదో తరగతి పూర్తికాగానే వరంగల్‌లోనే కారు మెకానిక్ సెంటర్ హెల్పర్‌గా పని నేర్చుకున్నాడు. శరత్‌ది పద్మశాలీ కుటుంబ నేపథ్యం కావడంతో సిరిసిల్లకు వలస వచ్చారు. అప్పటికే కారు మెకానిక్ వృత్తిలో నైపుణ్యం పొందిన శరత్ సొంతంగా కారు మెకానిక్ సర్వీసింగ్ సెంటర్ ప్రారంభించాడు. గ్యారేజీకి వచ్చిన పలు రకాల కంపెనీలకు చెందిన కార్లను రిపేయిర్ చేస్తున్నాడు. తాను జీవనోపాధి పొందడమే కాకుండా మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నాడు. దాదాపు రోజుకు మూడు వాహనాలను రిపేర్ చేస్తూ నెలకు రూ.50 వేల వరకు సంపాదిస్తున్నాడు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలనే సంకల్పం ఉంటే, ఏ రంగంలోనైనా నిలదొక్కుకోవచ్చని చాటిచెపుతున్నాడు.


శరత్, సిరిసిల్ల

18 ఏళ్లుగా బైక్ మెకానిక్‌గా..

సిరిసిల్ల పట్టణానికి చెందిన మానుకోల నరేశ్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. ఆర్థికంగా స్థిరపడాలనే సంకల్పంతో 18 ఏళ్ల క్రితం బైక్ మెకానిక్ వృత్తిని ఎంచుకున్నాడు. పట్టణంలోని ఓ బైక్ షో రూమ్‌లో చేరి, వివిధ సమస్యలతోవచ్చిన బైక్‌లను రిపేయిర్ చేయడం నేర్చుకుంటూ 10 ఏళ్లలో పట్టుసాధించాడు. అనంతరం సొంతంగా బైక్ సర్వీసింగ్ సెంటర్‌ను ప్రారంభించాడు. తనకు నచ్చిన మెచ్చిన వృత్తిని నమ్ముకొని జీవనోపాధి పొందుతున్నాడు. రోజుకు రెండు నుంచి మూడు మోటారు వాహనాలను మరమ్మతు చేస్తూ నెలకు రూ.30 వేలకు పైగా సంపాదిస్తున్నాడు.


బైక్ రిపేర్ చేస్తున్న మానుకోల నరేశ్

చదువుకుంటున్న సమయంలోనే

సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కి చెందిన ఇమ్రాన్ పాఠశాలలో చదువుకుంటున్న సమయంలోనే బైక్ సర్వీస్ సెంటర్‌లో పనిచేశాడు. ఐదేళ్ల పాటు పనిచేసి బైక్ మెకానిక్ రిపేయిర్‌లో శిక్షణ పొందాడు. అనంతరం ముంబాయి, హైదరాబాద్ వంటి నగరాల్లో బైక్ షోరూమ్‌లలో పనిచేశాడు. ఐదేళ్ల క్రితం సిరిసిల్లకు వచ్చి సొంతంగా బైక్ మెకానిక్ సెంటర్‌ను ప్రారంభించి, ఉపాధి పొందుతున్నాడు. రోజు మూడు నుంచి నాలుగు బైక్‌లను రిపేర్ చేస్తూ నెలకు రూ.35 వేలకు పైగా సంపాదిస్తున్నాడు.


బైక్ రిపేర్ చేస్తున్న ఇమ్రాన్

పండగ పూట పస్తులుంటున్నం..

- నాలుగు నెలలుగా జీతాలిస్తలేరు
- డివైడర్స్, పార్కుల్లో శానిటేషన్ వర్కర్స్
- సిరిసిల్ల మున్సిపల్ ఎదుట ధర్నా

సిరిసిల్లటౌన్: 'నాలుగు నెలలుగా జీతాలిస్తలేరు.. పండగ పూట పస్తులుంటున్నాం..' అంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో డివైడర్స్, పార్కుల్లో మొక్కలకు నీళ్లు, కలుపు తీసేసే కార్మికులు మున్సిపల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో 43మంది కార్మికులు డివైడర్స్ మధ్యలో, పార్కుల్లో నీరు పోస్తూ జీవిస్తున్నారన్నారు. వారికి కాంట్రాక్టర్లు నాలుగు నెలలుగా జీతాలిస్తలేరన్నారు. అరకొర జీతాలతో గడిపే నిరుపేద కార్మికుల పట్ల కాంట్రాక్టర్లు నిర్దయగా ప్రవర్తించడం సరికాదన్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ స్పందించి వారికి జీతాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో శారద, లక్ష్మి పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కార్మికులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాజన్నపేటలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావుతో కలిసి శనివారం ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్, గ్రామ పాలకవర్గాన్ని అభినందించారు. ఎస్సై రమాకాంత్, ఉపసర్పంచ్ కల్లూరి వెంకటరమణారెడ్డి, నాయకులు అందే సుభాశ్, కార్యదర్శి రవి, బండారి బాల్‌రెడ్డి, స్వామి, చల్ల సుధాకర్‌రెడ్డి, భూమయ్య, లత, నమలిగొండ జగన్ పాల్గొన్నారు.

యువత పెడదారి పట్టొద్దు

యువత పెడదారి పట్టొద్దని, తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి కోరారు. మండలంలోని సింగారంలో శనివారం రాత్రి పోలీస్ కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిస కావద్దని సూచించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్సై రమాకాంత్, సర్పంచ్ మంగోలి నర్సాగౌడ్, ఉపసర్పంచ్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న పోలీస్ అధికారులు, నాయకులు

గౌడలకు అండగా ఉంటా

- బీఆర్‌ఎస్‌లోకి గౌడ సంఘం సభ్యులు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ: రాబోయే రోజుల్లో గౌడ కులస్తులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని, వారి సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు హామీ ఇచ్చారు. శనివారం గౌడ సంఘం వేములవాడ పట్టణ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నెరేళ్ల శ్రీధర్, బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జెల రమేశ్‌తో పాటు సుమారు 200 మంది గౌడ సంఘం సభ్యులు పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు తిరిగి అమలు కావాలంటే తప్పకుండా మూడోసారి కేసీఆర్‌ను సీఎం కావాలన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్‌లు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, నాయకులు గజ్జెల శ్రీనివాస్, నెరేళ్ల నారాయణ, పూదరి మురళి, గట్టయ్య, రవి, బైరగొని అంజయ్య, బుర్ర లక్ష్మీరాజం, బాలసాని మల్లేశం పాల్గొన్నారు.


కండువా కప్పుతున్న చల్మెడ

'బతికుండానే చంపేశారు'

సిరిసిల్లఅర్బన్: తాను బతికుండగానే అధికారులు చంపేశారని ఎల్లారెడ్డిపేటకు చెందిన రైతు నేవూరి దేవేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడారు. 2018లో పంట రుణం తీసుకుని, వడ్డీ సైతం చెల్లిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పంట రుణమాఫీ జాబితాలో తన పేరు రాలేదన్నారు. ఈ విషయమై కేడీసీసీబీ అధికారులను కలువగా.. వ్యవసాయాధికారులను కలువమని సూచించారని తెలిపారు. వ్యవసాయాధికారులను కలువగా 'లోన్ సాంక్షన్ ఆఫ్టర్ డెత్' అని రికార్డులో ఉందని, బతికున్నట్లు సర్టిఫికెట్ తీసుకురమ్మని సూచించారని ఆవేదన వ్యక్తం చేశారు. చేసేదేమి లేక బతికున్నట్లు సర్టిఫికెట్ ఇచ్చానని వాపోయాడు. ప్రతిపక్ష నాయకుడిని కావడంతనే తనను వేధిస్తున్నారని, తనకు రుణమాఫీ చేయాలని లేకుంటే న్యాయ పోరాటానికి సిద్ధమన్నాడు. సమావేశంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శిరస్వాల్ కైలాశ్, నరేశ్, పర్శరామ్, శివ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బాధితుడు దేవేందర్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

సెస్ డైరెక్టర్‌ను అరెస్ట్ చేయాలి

ఎల్లారెడ్డిపేట: సెస్ డైరెక్టర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరిని అరెస్టు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ ఆఫీస్ ఎదుట శనివారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ రామచంద్రంకు ఫిర్యాదు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ రాచర్లబొప్పాపూర్‌లో కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి భూమి 29 గుంటలను ఆక్రమించి ఇతరులకు విక్రయించారన్నారు. దీనిపై భూయజమాని హైకోర్టును ఆశ్రయించగా కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో సెస్ డైరెక్టర్‌తోపాటు 15 మందిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

కోనరావుపేట: మండలం పల్లిమక్త గ్రామంలో శనివారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. పల్లిమక్తలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు.

'ఐదు వందలకే వంట గ్యాస్'

ముస్తాబాద్: మండలంలోని మద్దికుంటలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై గడప గడపకు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఎస్సీ సెల్ అధ్యక్షుడు తలారి నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.

తడగొండలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

బోయినపల్లి: బోయినపల్లి మండలంలోని తడగొండ గ్రామ బస్టాండ్ ప్రాంతంలో హైమాస్ట్ లైట్లను గ్రామ సర్పంచ్ రమేశ్ శనివారం సాయంత్రం ప్రారంభించారు.

పీసీలుగా ఎంపికైన యువకులకు సన్మానం

ముస్తాబాద్: కానిస్టేబుళ్లుగా ఎంపికైన బందనకల్‌కు చెందిన దేవరాజు, ముస్తాబాద్‌కు చెందిన వేముల సాయివిహార్‌లను ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు శనివారం సన్మానించారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన యువతికి సన్మానం

తంగళ్లపల్లి: ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికైన మండలంలో జిల్లెల్ల గ్రామానికి చెందిన బర్ల అఖిలను శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ మాట్ల మధు ఆధ్వర్యంలో సత్కరించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

గంభీరావుపేట: ఇటీవల మృతిచెందిన మండలంలోని రాజేశ్వర్‌రావునగర్ గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీనివాస్ కుటుంబానికి దాతలు ఆర్థిక చేయూతనందించారు. నిరుపేద కుటుంబం కావడంతో పలువురు గ్రామస్తులు, దాతలు తలాకొంత పోగు చేసి రూ.లక్ష ఆర్థికసాయం అందించినట్లు ఒడ్డెర సంఘం డివిజన్ ఇన్‌చార్జి పిట్ల బాబు తెలిపారు.

చేప పిల్లలు పంపిణీ

వీర్నపల్లి: మండల కేంద్రంలోని వెంకటారాయిని చెరువు, దండనోని కుంటలో 75 వేల చేప పిల్లలను వదిలినట్లు సర్పంచ్ పాటి దినాకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తొటు రవి, యూత్ అధ్యక్షుడు తొటు అజెయ్, సంఘ సభ్యులు గుమ్మడి రాజేశం.నాంపెల్లి, చంద్రమౌళి, రవి పాల్గొన్నారు.

అతివలు మెచ్చేలా బతుకమ్మ చీరలు


చీరలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ


ఎల్లారెడ్డిపేట:బాకూర్‌పల్లితండాలో..

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు అందిస్తున్న బతుకమ్మ చీరలు తెలంగాణ ఆడపడుచులు మెచ్చేలా ఉన్నాయని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. శనివారం స్థానిక 3, 13, 17, 36 వార్డుల్లో జరిగిన చీరల పంపిణీని అమె ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ పండుగకు సీఎం కేసీఆర్ ప్రతి ఏడాది అందిస్తున్నారన్నారు. ఏడో విడతలో భాగంగా 25 రంగుల్లో 525 రకాల బతుకమ్మ చీరలు తయారు చేశారన్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్క యువతి, మహిళకు చీరలు అందిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు జాగీరు శైలు, గుండపల్లి నీరజ, కల్లూరి రాజు పాల్గొన్నారు. స్థానిక ఐదో వార్డులో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు చీరలు పంపిణీ చేయగా కౌన్సిలర్ దార్నం అరుణ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బాకూర్‌పల్లితండాలో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆజ్మీరా మంజుల, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలం ముస్తఫానగర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం మహిళలకు ప్రభుత్వం అందించిన బతుకమ్మ చీరలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ శివరాత్రి నర్సింలు, వార్డు సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు బండ రమేశ్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నారాయణరావు, సీఏ భారతి, నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని తడగొండ, గుండన్నపల్లి, వెంకట్రావుపల్లి తదితర గ్రామాల్లో శనివారం బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. సర్పంచులు చిందం రమేశ్, కొప్పుల లక్ష్మి, బూర్గుల నందయ్య, ఎంపీటీసీ అక్కెనపెల్లి ఉపేందర్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లి, జవహర్‌లాల్ నాయక్ తండా, కంచర్ల, భూక్య తండా గ్రామాల్లో బతుకమ్మ చీరలను గ్రామ సర్పంచులు భారతి, లత, శ్రీనివాస్, రజిత పంపిణీ చేశారు.

రుద్రంగి: మండలంలోని బడితండా గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలను శనివారం పంపిణీ చేశారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం (పాతబస్టీ) వద్ద శనివారం ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన గంట అంజాగౌడ్, బింగి మల్లేశం శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాలు కప్పి కె.కె.మహేందర్‌రెడ్డి ఆహ్వానించారు. అంజాగౌడ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ మోసం చేయడంతోనే కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, పందిర్ల లింగంగౌడ్, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, మానుక నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి గుట్ట హుండీ ఆదాయం రూ.8లక్షలు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న దత్తత ఆలయం నాంపల్లిగుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి హుండీ ఆదాయం రూ.8లక్షలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఒక్క గ్రాము 900 మిల్లీగ్రాముల బంగారం, 500 గ్రాముల 5 మిల్లీగ్రాముల వెండి వచ్చినట్లు వివరించారు.

నియామకం

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎల్లాగౌడ్

ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు లింగంపల్లి ఎల్లాగౌడ్‌ను నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి శనివారం లింగంపల్లి ఎల్లాగౌడ్‌కు అందజేశారు. తన నియామకానికి సహకరించిన సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు ఎల్లాగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడిగా యాదుల్

గంభీరావుపేట: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడిగా మహ్మద్ యాదుల్ నియమిస్తూ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాహెబ్ ఉత్తర్వులు అందించారు. పార్టీ మండలాధ్యక్షుడు హమీద్, పట్టణాధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా రాజు

బోయినపల్లి: బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కొదురుపాక గ్రామానికి చెందిన సారంపల్లి రాజును నియమిస్తూ పార్టీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి శనివారం నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ ఉదారి నర్సింహాచారి, ఐల మహేశ్‌కృష్ణ, కొనుకటి హరీశ్, సుంకపాక ప్రభు, ఇల్లెందుల బాలయ్య, భూంరెడ్డి, కల్యాణం అనీల్ పాల్గొన్నారు.

సమాచారం

ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఅర్బన్: సమాచార, పౌరసంబంధాల శాఖలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీపీఆర్వో మామిండ్ల దశరథం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయ పౌరసంబంధాల అధికారి, పబ్లిసిటీ అసిస్టెంట్ (ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్), ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 9వ తేదీతో గడువు ముగియనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు 2024 మార్చి 31 వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.

పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ అందజేత



కోనరావుపేట: మండలం నిజామాబాద్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం దాతలు మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. పాఠశాలలో చదువుతున్న నల్ల రేశ్వన్, లక్ష్మి ప్రజ్ఞల తాత నల్ల రాజేశం, తండ్రి కమలాకర్ కలిసి రూ. 25 వేల విలువైన ప్లాంట్‌ను పాఠశాలకు అందజేశారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

చందుర్తి: కుటుంబ కలహాలతో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. చందుర్తికి చెందిన అసినిపర్తి దినకర్ (34) తనకున్న వ్యవసాయ బావిని మార్టిగేజ్ చేసి బ్యాంకులో రుణం తీసుకుంటానని శుక్రవారం తల్లి సునందకు చెప్పాడు. అందుకు తల్లి నిరాకరించింది. మనస్థాపానికి గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య సౌందర్య ఉంది. ఆత్మహత్యపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడి రిమాండ్

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్(టోని)తో పాటు కటకం రాజశేఖర్, గుగ్గిల్ల శ్రీకాంత్‌గౌడ్, గణాది కిషన్, కొత్త రవీందర్‌గౌడ్‌పై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శనిగరం తిరుపతి అనే వ్యక్తి కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటికి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న తిపురవేణి దేవరాజును గురువారం రాత్రి ఐదుగురు వ్యక్తులు కర్రలతో దాడి చేసి రెండు సెల్ ఫోన్లు దొంగిలించారు. అంతేకాకుండా ఆయన ఇంటి గోడను కూడా కూల్చివేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.